


పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 28,807 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 33,640 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 7713 క్యూసెక్కులు వదలగా బ్యాంక్ కెనాల్‌కు 1861 క్యూసెక్కులు వదిలారు.



49,041 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,733 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 49,041 బస్తాలు అమ్మారు.

న్యూస్‌రీల్

మూడు నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు



అమరావతి: పంచారామాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో వేంచేసి యున్న బాలచాముండిక సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శ్రీ దేవీ శరన్నవరాత్ర దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి వేమూరి గోపినాథశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆశ్వీయిజ శుద్ధ పాడ్యమి నుంచి ద్వాదశి వరకు బాలచాముండేశ్వరీ, జ్వాలాముఖీ అమ్మవార్లకు ప్రతి నిత్యం మూడు వేళల సహస్ర కుంకుమార్చన, దేవీఖడ్గమాల, లలితా అష్టోత్తరనామార్చన, సప్తశతి పారాయణం, ప్రతి రోజూ చండీహోమం నిర్వహిస్తామని తెలిపారు. మూడో తేదీ శ్రీదేవీ శరన్నవరాత్ర కలశస్థాపన చేసి బాలచాముండేశ్వరి అమ్మవారికి రజతకవచాలంకృత అంకారం, 4న బాలత్రిపురసుందరి, ఐదున గాయత్రీదేవి, ఆరున అన్నపూర్ణాదేవి, 7న లలితాత్రిపురసుందరిదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దనిదేవి, 12న రాజరాజేశ్వరిదేవిగా అలంకరించనున్నట్లు తెలిపారు. దసరానవరాత్రులు సందర్భంగా అక్టోబరు 24న స్వామి వారికి చండీకల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. 25వతేదీ రాత్రి పారువేట, ఎనిమిది గంటలకు శమీపూజ నిర్వహిస్తామన్నారు.

23న సత్తెనపల్లిలో జాబ్‌మేళా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి కె.సంజీవరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు ఐల అగ్రి సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, బిజడ్ ఫిన్‌సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ రిటైల్, శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్స్ వంటి సంస్థలు హాజరై అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఫార్మసీ చదువుకున్న నిరుద్యోగ యువత తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు ఇ.రామకృష్ణారెడ్డి (సెల్ నెం.8074393466), బి.అంజిరెడ్డి (సెల్ నెం.9494986164) లను సంప్రదించాలని సూచించారు.


కుక్కల స్వైర విహారం

పలువురికి గాయాలు



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లిలో వీధికుక్కలు శుక్రవారం స్వైర విహారం చేశాయి. వీధుల్లో కనిపించిన వారిపై దాడి చేసి విచక్షణరహితంగా గాయపరిచాయి. ఇరికేపల్లిలోని జంగాల కాలనీ వీధిలో నిలుచున్న ఏడేళ్ల బాలుడు తేజపై కుక్కలు దాడి చేశాయి. చేతులు, కాళ్లు, వీపుపై ఇష్టంవచ్చినట్లుగా గాయపరిచాయి. గాయాల నుంచి రక్తస్రవం జరిగింది. వైద్యం కోసం తేజని హాస్పిటల్‌కి తరలించారు. ఇదే కాలనీలో మరికొంతమందిపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరచటంతో బాధితులను వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. నగర పంచాయతీ అధికారులు వీధికుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని, ప్రజల ప్రాణాలతో నగర పంచాయతీ అధికారులు చెలగాటం ఆడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,633, ఎడమకాలువకు 5,510, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,973, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 46,516 క్యూసెక్కులు వచ్చి చేరటంతో అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

లడ్డూ ప్రసాదంపై ప్రమాణానికి

చంద్రబాబు సిద్ధమా?

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఆరోపణలు నిజమేనని నమ్మితే ప్రమాణం చేయాలి
- మాజీ సీఎం జగన్ లక్ష్యంగా తప్పుడు ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబు
- ఈ ఆరోపణల వెనుక భారీ రాజకీయ కుట్ర దాగి ఉంది



టీటీడీ అధికారిణి ప్రసంగాన్ని సెల్‌ఫోన్‌లో చూపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: కలియుగ వైకుంఠ దేవుడు నివాసం ఉండే తిరుపతి తిరుమల లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన ఆరోపణలు నిజమేనని అతనే భావిస్తే టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి చేసిన ప్రమాణ సవాల్ స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు సంచలన ఆరోపణలు వెనుక భారీ రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. ఈ ఆరోపణలు వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి కీలక నేతలు సహా ప్రతి ఒక్కరూ తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఏడాదికి ఒకసారైనా తప్పనిసరిగా దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరిస్తారని అన్నారు. అటువంటి పవిత్ర ప్రసాదంపై ఏ భక్తుడు కూడా వాసన, రుచిలో తేడా, అనుమానం ఎవరికి రాలేదని అన్నారు. కానీ ముఖ్యమంత్రి జులై 17 తేదీన నేషనల్ డెయిరీ ల్యాబ్‌కు నెయ్యి శాంపిల్స్ పరీక్ష కోసం పంపితే జులై నెల 21న దాని తాలూకు నివేదిక ఇచ్చిందని, ఆ రిపోర్టు ప్రకారం ఈ నెయ్యిలో ఎనిమల్ ఫ్యాట్, ఫిష్ ఆయిల్ వంటి కొన్ని అపవిత్ర కారకాలు కలిపినట్లు రిపోర్ట్ వచ్చిందని చెప్తున్నారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం నియమించిన టీటీడీ ఈవో శ్యామలరావు, టీటీడీ అధికారిణి సైతం ఈ నెయ్యిలో వనస్పతి కలిసిందేమోనని మాత్రమే చెప్పడం జరిగిందన్నారు. టీటీడీ అధికారిణి కూడా తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రతిరోజూ రెండు ట్యాంకర్లు నెయ్యి వస్తుందని, వచ్చిన వెంటనే మూడు రకాల శాంపిల్స్ తీసి టెస్టింగ్ చేసిన అనంతరం అవి బాగా ఉన్నాయని రిపోర్టు వస్తేనే ఆ ట్యాంకర్లను దిగుమతి చేసుకుంటామని తెలిపారని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆమె మాట్లాడిన మాటలను సెల్‌ఫోన్ ద్వారా గోపిరెడ్డి వినిపించారు. కానీ చంద్రబాబు మాత్రం ఆయన నియమించిన అధికారులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లను పక్కన పెట్టి కేవలం రాజకీయ కోణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన సంచలన ఆరోపణలపై జాతీయ మీడియాలో తీవ్రమైన చర్చ జరుగుతుందన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపణలపై నిజానిజాలు నిగ్గు తేల్చాలని, శ్రీవారి పాదాల ముందు మా కుటుంబ సభ్యులతో మేము ప్రమాణం చేయడానికి సిద్ధమని, మీరు కూడా మీ కుటుంబ సభ్యులతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారని అన్నారు. ఈనాడు పత్రికలో సైతం ల్యాబ్ రిపోర్ట్ గురించి రాస్తూ ఈ ల్యాబ్ టెస్ట్ రిపోర్ట్ కొన్ని కొన్ని సందర్భాల్లో తేడా వచ్చే అవకాశం ఉందని రాశారని, ల్యాబ్ టెస్ట్ ఇచ్చిన శాంపుల్ నెంబరు, రిపోర్ట్‌లో ఇచ్చిన నెంబరు వేర్వేరుగా ఉన్నాయని, ఈ రిపోర్టు ఎంతవరకు కరెక్ట్ అనే దానిపై సత్వరమే కూటమి ప్రభుత్వం విచారణ జరిపించాలని కోరారు. చంద్రబాబు వయసు రీత్యా మాటలు స్లిప్ అయ్యే అవకాశం ఉందని, ఎవరు తప్పు చేశారో తేల్చే అధికారం వారి వద్దనే ఉందని, మీరు తప్పుగా మాట్లాడారా, నిజంగా తప్పు జరిగిందా అనేది వెంటనే తేల్చాలని కోరారు. ఏది ఏమైనప్పటికీ హిందువులకు పవిత్ర దేవస్థానమైన టీటీడీ లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చేసిన సంచలన ఆరోపణలపై ప్రభుత్వం నిజా ,నిజాలు వెంటనే నిగ్గు తేల్చి, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది హిందువుల మనోభావాలు కాపాడాలని డాక్టర్ గోపిరెడ్డి కోరారు.

ఎవరి నోటికి తాళం వేస్తారు..?

అంతేకాకుండా రాజధాని మునిగిందని ఎవరైనా మాట్లాడితే వారి నోటికి తాళం వేస్తానని, కేసులు పెడతామని ముఖ్యమంత్రి అంటున్నారని, రాజధాని నిర్మాణానికి అమరావతి అనుకూలంగా లేదని వరల్డ్ బ్యాంక్, మంత్రి నారాయణ స్వయంగా చెప్పారని, వారినేమి చేస్తారని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ప్రశ్నించారు.





పిడుగురాళ్ల పట్టణంలో మూడు రోజులుగా మూతపడ్డ బార్ అండ్ రెస్టారెంట్

మీరు ఆగండి...

మేం వ్యాపారం చేసుకుంటాం

- బార్ అండ్ రెస్టారెంట్ యజమానులపై టీడీపీ నాయకుల ఒత్తిడి
- మూతపడ్డ ఆరు బార్ అండ్ రెస్టారెంట్‌లు

పిడుగురాళ్ల: మీరు వ్యాపారం ఆపండి... మేం వ్యాపారం చేస్తామంటూ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులపై అధికార పార్టీ నాయకులు ఎక్సైజ్ శాఖ అధికారుల ద్వారా ఒత్తిడి చేస్తున్నారు. పిడుగురాళ్ల పట్టణంలో ఆరు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవి మూడు రోజులుగా మూతపడ్డాయి. దీంతో మందుబాబులు మద్యం తాగేందుకు పక్క పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో పిడుగురాళ్ల పట్టణంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు వైఎస్సార్ సీపీ మద్దతుదారులుగా ఉన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, టీడీపీ మద్దతుదారులు మాత్రమే ఈ బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహించాలని హుకుం జారీ చేయటంతో చేసేది లేక ప్రస్తుతం పట్టణంలోని అన్ని బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేశారు.

ఫీజులు చెల్లించమనేది వారే...వద్దని చెప్పేది వారే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పిడుగురాళ్ల పట్టణంలోని ఆరు బార్ అండ్ రెస్టారెంట్లకు మూడేళ్ల పాటు అనుమతులు ఇచ్చారు. రెండేళ్లు పూర్తయ్యాయి. మరో ఏడాదికి కాల పరిమితి ఉండటంతో అక్టోబర్ 30 నాటికి మిగిలిన ఏడాదికి లైసెన్స్ ఫీజులు చెల్లిచాల్సి ఉంది. ఎక్సైజ్ శాఖ అధికారులు ఫీజులు చెల్లించాలని 20 రోజులు ముందుగానే నోటీసులు జారీ చేశారు. ఇప్పుడు ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు ఫీజులు చెల్లించేందుకు సిద్ధంగా ఉండటంతో ఇదే ఎక్సైజ్ శాఖ అధికారులు మీరు చెల్లించవద్దని మౌఖికంగా చెబుతున్నారు. అధికార పార్టీ వారు వ్యాపారం చేసుకుంటారని మరోవైపు చెప్పటం చర్చనీయాంశంగా మారింది.

ఫీజులు చెల్లించలేమని లెటర్లు రాయిస్తున్న అధికారులు

బార్ అండ్ రెస్టారెంట్లకు చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులు చెల్లించలేకపోతున్నామని ఇప్పుడు ఉన్న లైసెన్స్ కలిగిన వ్యక్తుల చేత లిఖితపూర్వకంగా ఎక్సైజ్ శాఖ అధికారులు రాయించుకొని వెళ్తున్నారు. అధికారులు ఇప్పుడు ఉన్న పాత లైసెన్స్‌లను రద్దు చేసి నూతన లైసెన్స్‌లు అధికార పార్టీకి చెందిన వ్యక్తులకు అందించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ తంతు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై పిడుగురాళ్ల ఎక్సైజ్ శాఖ సీఐ సూర్యనారాయణను సాక్షి వివరణ కోరగా తాను ఇంకా సెబ్ పరిధిలోనే ఉన్నానని, ఎక్సైజ్ శాఖలోకి రాలేదని, దానికి సంబంధించిన పూర్తి సమాచారం తనకు తెలియదని అన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి రూ.మూడు కోట్లు గండి

పట్టణంలో గతేడాది ఆరు బార్ అండ్ రెస్టారెంట్లకు ఒక్కొక్క దానికి సుమారు రూ.48 లక్షల చొప్పున ఆరింటికి కలిపి రూ 2.88 కోట్లు చెల్లించారు. అక్టోబర్ 30వ తేదీ నుంచి చెల్లించాల్సిన ఫీజు 10 శాతం పెంపుతో చెల్లించాల్సి ఉంది. ఈ ఫీజు ఈనెల 1వ తేదీ నాటికి చెల్లించాల్సి ఉంటుంది. సుమారు రూ.3.17 లక్షల వరకు ఈ ఏడాది లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు చెల్లించకపోవటంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తే ఈ నెలాఖరులోగా ఫైన్‌తో బార్ అండ్ రెస్టారెంట్లకు లైసెన్స్ ఫీజు కట్టుకునే అవకాశం ఉంది.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

- గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి
- అధికారులతో నేర సమీక్ష
- ప్రతిభ చూపించిన అధికారులకు రివార్డులు అందజేత



సీఐకి రివార్డు అందజేస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: పోలీసుస్టేషన్లకు వచ్చే మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షలో పాల్గొని పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలని, పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సున్నితమైన భాషతో మాట్లాడాలని, వారితో మమేకమై సమస్యలను ఓపికగా వింటూ న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని అన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి పోర్టల్‌లో డాక్యుమెంట్లు అప్‌లోడు చేయాలన్నారు. పోక్సో కేసులు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయటంతోపాటు నేరాలు అరికట్టే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయా లని అన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ప్రతి రోజూ రైడ్‌లు నిర్వహించాలన్నారు. దిశ కాల్స్, 112, 100 ఎమర్జెన్సీ నెంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యంగా స్పందించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, నాటుసారా తయారీ, క్రయ విక్రయాలు అరికట్టాలని ఆదేశించారు.

ప్రతిభ చూపించిన వారికి రివార్డులు అందజేత

రివార్డులు అందుకున్న వారిలో సత్తెనపల్లి టౌన్, అమరావతి, చిలకలూరిపేట రూరల్, టౌన్, పిడుగురాళ్ల, మాచర్లటౌన్, దాచేపల్లి, కారెంపూడి సీఐలు బి.బ్రహ్మయ్య, ఎం.శ్రీనివాసరావు, బి.సుబ్బనాయుడు, పి.రమేష్, ఎ.వెంకటరావు, పి.ప్రభాకర్, జి.వెంకటరావు, టి.వి.శ్రీనివాసరావు, ఎఫ్‌పీబీ, సీఐడీ సీఐ షేక్ అబ్దుల్ రహమాన్, యడ్లపాడు, క్రోసూరు, దుర్గి, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐలు వి.బాలకృష్ణ, నాగేంద్రరావు, ఎల్.సుధీర్, సంధ్యారాణి, సీఐడీ ఏఎస్ఐ పి.సురేంద్రబాబు ఉన్నారు. అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైం అదనపు ఎస్పీ సీహెచ్.లక్ష్మీపతి, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు ఉన్నారు.

చెంచులకు కనీస వసతులు కల్పించండి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు
- పీఎం జన్‌మన్‌పై సమీక్ష



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో ఏకైక పీవీటీజీ (పర్టికులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్) గా గుర్తింపబడిన చెంచులకు ప్రధానమంత్రి జన్‌మన్ ద్వారా కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి జన్‌మన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరు మండలాల్లోని 51 నివాస ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న 7235 మంది చెంచులకు జన్‌మన్ పథకం ద్వారా 11 రకాల మౌలిక వసతులు అందేలా చూడలన్నారు. జిల్లాలోని చెంచుల నివాస ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరైన 608 ఇళ్లు, 29.9 కి.మీల రోడ్లు, 19 నివాసాలకు తాగునీటి సరఫరా, 11 మొబైల్ మెడికల్ యూని ట్లు, 16 హాస్టళ్లు, 18 అంగన్‌వాడీ సెంటర్లు, 782 విద్యుత్ కనెక్షన్లు, 8 మొబైల్ టవర్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పథకాలు అందించడంలో ఇబ్బందులు లేకుండా గుర్తింపు కార్డులు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. వారంలోగా అందరికీ జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు, మూడు వారాల్లోగా ఆధార్, ఆయుష్మాన్ కార్డులు, నెల రోజుల్లోగా ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్ అందించాలన్నారు. చిలకలూరిపేట, బొల్లాపల్లి మండలాల్లో ఇప్పటి వరకూ రికార్డులకెక్కని చెంచులను గుర్తించేందుకు సర్వే చేపట్టి వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. శ్రీశైలం ఐటీడీఏ ఏపీవో సురేష్, గురజాల ఆర్డీఓ రమణా కాంత్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, హౌసింగ్ పీడీ శివలింగం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, నరసరావుపేట, గురజాల డీఎల్డీవోలు వెంకట్‌రెడ్డి, గబ్రు నాయక్, డీఈవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ప్రజాభిప్రాయసేకరణ తీసుకోవాలి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): సచివాలయ సిబ్బంది విధిగా ప్రతి ఇంటికి వెళ్లి పాలన, రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయసేకరణ తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా స్వర్ణ ఆంధ్ర-2024 దృష్టిలో ఉంచుకొని మరింత పటిష్టంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టడంలో ప్రజల అభిప్రాయాలు సేకరించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించారని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశారని గుర్తుచేశారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటి వద్ద ఐదు నిమిషాలు కేటాయించి వారి అభిప్రాయాలను సవిరంగా సేకరించాలన్నారు. స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయటం జరుగుతుందన్నారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో సూచించిన విధంగా సూపర్‌సిక్స్ కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు దరువూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎండిపోతున్న మిరప మొక్కలు



ఎండిపోయిన మిరప మొక్కలు పీకి కొత్తవి నాటుతున్న కూలీలు



మిరప మొక్కలను కాపాడేందుకు పురుగుమందు పిచికారి చేస్తున్న రైతు



నర్సరీ నుంచి మిరప నారు ఆటో ద్వారా తీసుకు వస్తున్న రైతులు

ఆశలు మొలకెత్తేనా..!

మిరప పంట కళ తప్పింది. సెప్టెంబర్ మాసంలో పచ్చగా కళకళలాడాల్సిన మిరప తోటలు వెలవెలబోతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మిరప పంటలకు బాగా నష్టం వాటిల్లింది. పొలంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో మొక్కలు ఉరకెత్తి కుళ్లిపోతున్నాయి. రైతులు ఆ మొక్కలను పీకేసి మళ్లీ కొత్తవి నాటే పనులను ముమ్మరంగా చేపట్టారు. ఒక్కసారి ఎకరం పొలంలో మిరప మొక్కలు నాటాలంటే రైతులకు రూ.30వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలకు రెండుసార్లు మొక్కలు నాటాల్సి రావటం రైతులను ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీసింది. పంటలో అక్కడక్కడ మొలకెత్తిన మొక్కలకు పురుగు మందులను పిచికారి చేస్తూ కాపాడేందుకు అన్నదాతలు శ్రమిస్తున్నారు.

– దాచేపల్లి

క్లుప్తంగా

ప్రజలకు పోస్టల్ శాఖ మెరుగైన సేవలు

పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి

నరసరావుపేట టౌన్: పోస్టల్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసే దానిలో భాగంగా భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా మూడు కార్యక్రమాలను రూపొందించినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు. పోస్టల్‌శాఖ డాక్ నిర్యాత్ కేంద్ర, డాక్ చౌపాల్, డిజి-పిన్ పేరుతో ఆవిష్కరించిన మూడు కార్యక్రమాల ద్వారా గ్రామీణస్థాయి నుంచి ప్రజలకు పోస్టల్‌శాఖ ద్వారా మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. డాక్ నిర్యాత్ కేంద్ర ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రం అని తెలిపారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేతి వృత్తులు, చిన్న, కుటీర పరిశ్రమల ద్వారా లభ్యమయ్యే వస్తువులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సులభతరంగా ఎగుమతి చేయవచ్చని తెలిపారు. డాక్ చౌపాల్ కార్యక్రమం ద్వారా గ్రామాలలోని ఇళ్ల వద్దకే పోస్టల్ సేవలను అందిస్తామన్నారు. దీని ద్వారా డిజిటల్ విభజనను తగ్గించటం, ప్రజలకు అవసరమైన సేవలను అందించటం, ఆర్థిక చేరికలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. డిజి-పిన్ ద్వారా పిన్‌కోడ్ సిస్టమ్, పోస్టల్ అడ్రస్, నావిగేషన్‌ను మెరుగుపరుస్తామని వివరించారు. ప్రజలు పోస్టల్‌శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో ప్రజా కళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం మృతి



ఉన్నం నాగేశ్వరరావు మృతదేహం

సత్తెనపల్లి: ప్రజా కళామండలి రాష్ట్ర కోశాధికారి పట్టణంలోని వడ్డవల్లికి చెందిన ఉన్నం నాగేశ్వరరావు (54) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కళ కళ కోసం కాదు ప్రజల కోసం అనే నినాదంతో ఉన్నం పేరుపొందాడు. డప్పు కొడుతూ ఆటపాటలతోనే తుదిశ్వాస విడిచాడు. అక్షరం చదువులేని భార్య రాణికి ఆట, పాట, చదువు నేర్పి ప్రజా కళామండలిలో చేర్పించి కుటుంబాన్ని ప్రజా కళలకు అంకితం చేశాడు. కుమార్తెను న్యాయ శాస్త్ర విద్యను చదివించి న్యాయవాదిగా పని చేయిస్తున్నాడు. నాగేశ్వరరావు మృతి వార్త తెలియడంతో ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి కోటి, తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు శనివారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని వడ్డవల్లిలో జరుగుతాయని, అంతిమయాత్రను జయప్రదం చేయాలని ప్రజా కళామండలి బాధ్యులు కోరారు.

క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవు

- డిప్యూటీ డీఈఓ ఏసుబాబు
- హెచ్‌ఎం, ఉపాధ్యాయుల మధ్య వివాదం పరిష్కారం
- డెప్యుటేషన్‌పై వెళ్లిన హెచ్‌ఎం



విద్యార్థులతో మాట్లాడుతున్న డెప్యూటీ డీఈవో ఏసుబాబు

దాచేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు క్రమశిక్షణ తప్పితే చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డెప్యూటీ డీఈఓ వి.ఏసుబాబు హెచ్చరించారు. నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల మధ్య సఖ్యత లేకపోవటంతో తరచూ గొడవలు పడుతూ విద్యార్థులకు చదువులు చెప్పటంలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ, డిప్యూటీ డీఈఓలకు ఫిర్యాదు చేశారు. డెప్యూటీ డీఈఓ ఏసుబాబు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల మధ్య జరుగుతున్న గొడవలపై ఆరా తీశారు. ఒక్కరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ప్రస్తుతం హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కొమ్మా శివయ్య కేసానపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. సీనియర్ ఉపాధ్యాయుడైన గుండా శ్రీనివాసరావుకి ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలు అప్పగించారు. పాఠశాలలో వివాదాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులను డెప్యూటీ డీఈఓ హెచ్చరించారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పనితీరుతోపాటుగా ఎండీఎం నిర్వహణపై ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేసానుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ని ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. హైస్కూల్‌లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేని అంశాన్ని విద్యార్థులు, స్థానికులు డిప్యూటీ డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల చదువులకు ఇబ్బందులు లేకుండా డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను పంపిస్తామని చెప్పారు. డెప్యూటీ డీఈఓ వెంట ఎంఈవో పినాకపాణి, సీఆర్పీలు అబ్రహం, చంద్రమోహన్, వెంకటేష్, హెచ్‌ఎం ఏసురత్నం, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆదాం, స్థానికులు గడిపూడి సాంబశివరావు, కోట సాయికుమార్ ఉన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

- పులివెందుల కళాశాల సీట్లను నిరాకరించడం ఏమిటి
- సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల రద్దు హామీ ఏమైంది
- సీఎం చంద్రబాబుకి ఎస్‌ఎఫ్‌ఐ లేఖ



రైల్వేస్టేషన్ రోడ్డులో ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

నరసరావుపేట: ప్రభుత్వ వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తుందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ విమర్శించారు. రాష్ట్రంలోని నూతన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం రైల్వేస్టేషన్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. సాయికుమార్ మాట్లాడుతూ విద్యను హక్కుగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తన బాధ్యతను మరిచి ప్రైవేటుకు వైద్య విద్య కట్టబెట్టడం దుర్మార్గమని అన్నారు. కేంద్రంతో సంప్రదించి ఐదు కళాశాలలకు అనుమతులు తీసుకురావాల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వమే ఏఎంసీకి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన నాలుగు కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఓపీ ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ చర్య వలన 700 సీట్లు కోల్పోయామని పేర్కొన్నారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలనే దుర్మార్గపు ఆలోచన నుంచే చేస్తున్న చర్యగా భావిస్తున్నామని తెలిపారు. అదే జరిగితే ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమౌతారని అన్నారు. రిజర్వేషన్ల ఊసే ఉండదని తద్వారా వెనకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్యసేవలు పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్ఫ్‌ఫైనాన్స్ పద్ధతిపైన తాము అధికారంలోకి వస్తే వందరోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించారని, ఇచ్చిన హామీపైన ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి రాక ముందు ఒక మాట, వచ్చాక వాటి ఊసెత్తకపోవడం కూటమి ప్రభుత్వపు వైఖరిగా ఉందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఏఎంసీకి రాసిన లేఖ వెనక్కి తీసుకోవాలని, సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దుచేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి, ఉచిత వైద్య విద్యను పేద, మధ్యతరగతి ప్రజలకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు షాదుల్లా, నాని, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరం వస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోండి

ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి



చౌటపాపాయపాలెంలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రవి

రాజుపాలెం: ఒక వ్యక్తికి జ్వరం వచ్చి రెండు, మూడురోజులైనా తగ్గకుంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెం, కొత్త బోధనం గ్రామాలలో జరుగుతున్న ఫ్రై డే-డ్రై డే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. రవి మాట్లాడుతూ ఇంటింటా జ్వరాల సర్వే జాగ్రత్తగా చేసినట్లైతే సీజనల్‌గా వచ్చే వ్యాధులు డయేరియా, డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చునని సిబ్బందికి సూచించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇళ్లల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలను తొలగించాలని, కూలర్స్‌లో నీటిని వారానికొకసారి మార్చుకోవాలని సూచించారు. దోమలను పారద్రోలడం వలన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు, బోధ వ్యాధి వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాలలోని సైడు కాలువల్లో వారానికొకసారి కిరోసిన్, బ్లీచింగ్ చల్లుకోవాలని అన్నారు. వర్షాకాలంలో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారితీస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హనుమకుమార్, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్‌రావు, ఉషారాణి, కమ్యూనిటీ హెల్త్ అధికారి హన్నాకుమారి, ఏఎన్‌ఎం ప్రమీలాభాయి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా కార్యదర్శి ఇ.శివ శంకర్ శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్‌జీఓ క్లబ్‌లో ఉంటాయన్నారు. ఎంపిక చేసిన జట్లను వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. వివరాలకు 93969 90666 ఫోను నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నీట మునిగిన పంట పొలాల గుర్తింపు

అమరావతి: వరదలకు నీట మునిగిన పంట పొలాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు వారం రోజులపాటు మండల పరిధిలోని వరద ముంపునకు గురైన గ్రామాలలో అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌వోలు పొలాలను పరిశీలించి పారదర్శకంగా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నీట మునిగిన పొలాలను నమోదు చేశారన్నారు. మండలంలో 1709 మంది రైతులకు చెందిన 2929.72 ఎకరాలలో వివిధ పంటల నీట మునిగాయన్నారు. ఇందులో 46.98 ఎకరాలలో 29మంది రైతులకు చెందిన ఉద్యాన పంటలు నీటమునిగాయన్నారు. ఈ వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు.

రేపు కత్తి పద్మారావుకు పురస్కారం ప్రదానం



మాట్లాడుతున్న డాక్టర్ అబ్రహాం లింకన్

తెనాలి అర్బన్: ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు డాక్టర్ కత్తి పద్మారావుకు ఖమ్మానికి చెందిన జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 'మన కాలపు జాషువా' పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ శుక్రవారం సాయంత్రం తెనాలిలోని సేవా ట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన పొన్నూరులోని లుంబినీవనంలో కార్యక్రమం ఉంటుందన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు, దళిత మహాసభ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. విలేకరుల సమావేశంలో అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కార్యదర్శి దోబా సందీప్, ట్రెజరర్ పాముల దాసు, కనపర్తి ఎజ్రా, కొండ్రు రవీంద్ర, కనపర్తి చిట్టిబాబు, బ్రూస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

- ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తా
- హామీ ఇచ్చిన డీఎంహెచ్‌వో డాక్టర్ రవి



డీఎంహెచ్‌వో రవికి వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు, వారి ప్రతినిధులు

నరసరావుపేట: తమపై రాజకీయ వేధింపులు ఆపి అనారోగ్యానికి గురైన తమకు సెలవులు ఇవ్వాలని ఆశా వర్కర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవికి ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆశాలతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకోవాలనే హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో తన కార్యాలయంలో ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. సమస్యలపై వారి నుంచి 15 సమస్యలతో కూడిన అర్జీ స్వీకరించారు. తమకు సంబంధంలేని సూదులు, వ్యాక్సిన్ బాక్స్‌లు తీసుకురావటం వంటి పనులను అప్పగించి ఆ పనులు చేయాలంటూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని, ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని, సబ్‌సెంటర్లు, సచివాలయాలు, హెల్త్ సెంటర్లలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30వరకు ఉండాలని వేధిస్తున్నారని, ఓపీ సబ్‌స్క్రిప్షన్‌లు రాయించటం, పరిసరాలు శుభ్రం చేయించటం ఆపాలని, కాన్పులకు ఏఎన్‌ఎంలు రాకుండా తమను మాత్రమే పంపించటం, 104 క్యాంపులలో ఇంజక్షన్లు, పరీక్షలు, మందులు ఇవ్వటం ఆపించాలని, సెల్‌ఫోన్లు ఇచ్చి చార్జింగ్ చేయించాలని, గర్భిణులు హాస్పిటల్‌లో చేరితే ఆమె అక్కడ ఉన్నంతకాలం తమను ఉండాలని ఒత్తిడి చేయటం ఆపాలని కోరారు. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, పరిధిలో లేనివాటిని పైఅధికారులకు పంపుతానని డీఎంహెచ్‌వో తెలియచేశారు. డీపీహెచ్‌ఎన్‌వో బి.సురేఖ, డీసీవో యస్.సురేష్, సీఐటీయు నాయకురాలు డి.శివకుమారి, ఆంజనేయనాయక్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



గుంటూరుమెడికల్: అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ సుచిత్ర అన్నారు. శుక్రవారం గుంటూరు ప్రాంతీయ శిక్షణ కేంద్రం, ఆర్డీ కార్యాలయాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. డాక్టర్ సుచిత్ర మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఊర్మిళ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మశ్రీ , ఆర్డీ కార్యాలయం సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రోసూరు విద్యార్థులు ఎంపిక



బి.చందన బి.తనూజ

క్రోసూరు: క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు ఇరువురు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ మేరీ రజిత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 15వ తేదీన అనంతపురం జిల్లా ఎస్‌కే యూనివర్సిటీ, క్యాంపస్ పాఠశాలలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్స్ బాలబాలికల జట్టు ఎంపిక చేశారు. పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి క్రోసూరులోని సెయింట్ ఆన్స్ పాఠశాల బాలికలు బి.చందన బి.తనుజ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ నెలలో జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో జరిగే 37వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు, పీఈటీ ఉపాధ్యాయుడు మక్కెన వెంకటరావు అభినందించారు.


తిరుమల లడ్డూ ప్రసాదంపై విషప్రచారం తిప్పికొట్టాలి



వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించండి

నరసరావుపేట: టీటీడీ లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే నెయ్యిపై ఏదైనా అనుమానాలు, అవినీతి జరిగిందని భావిస్తే చిత్తశుద్ధితో వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించి విచారణ చేయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మనిషి అనేవాడెవడూ భక్తుల మనోభావాలతో ఆడుకోరని, ప్రస్తుత ప్రకటనలతో చంద్రబాబు నీచ రాజకీయానికి పాల్పడుతున్నాడనే అభిప్రాయం వ్యక్తమౌతుందన్నారు. ప్రతిపక్షంతో ఏదైనా ఉంటే రాజకీయంగా చూసుకోవాలేకాని, కోట్లాది మంది కొలిచే కలియుగదైవంగా భావించే శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రసాదంపై అబద్ధపు ఆరోపణలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. లడ్డూ తయారీకి తాము నాణ్యమైన నెయ్యిని సరఫరా చేస్తున్నామని, ఇటీవలనే 16వేల టన్నుల నెయ్యిని అందజేశామని, తమిళనాడుకు చెందిన ఏఆర్ కంపెనీ వివరణ ఇచ్చిందన్నారు. రాజకీయాలకు తిరుమలను వేదికగా మార్చటం తగదని, చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో తిరుమల వివాదంలో చిక్కుందన్నారు. ఇటువంటి విష ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని మౌలాలి పిలుపునిచ్చారు.

జాతీయ క్యారమ్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు గ్వాలియర్‌లో జరగనున్న 49వ జాతీయ జూనియర్ నేషనల్స్ పోటీలకు జిల్లాకు చెందిన బి.నవ్య, జి.మయూఖలు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రా స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నవ్య బంగారు, మయూఖ రజత పతకాలు సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. క్రీడాకారులకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నీరజ్ కుమార్ స్కాంపతి, చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావులు అభినందనలు తెలిపారన్నారు.

శుభ్రతా కార్యక్రమాల్లో పొగాకు బోర్డు

కొరిటెపాడు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగబోయే ఈ కార్యక్రమంలో భాగంగా రైతు భవన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ జి. దామోదర్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంటనే జీవో నెం. 85 రద్దు చేయాలి

గుంటూరుమెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు పీజీ చదువుకోవాలనే కోరికను హరించి వేస్తున్న జీవో నెం. 85ను ప్రభుత్వం రద్దు చేయాలని ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. గ్రామీణ రోగులకు స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు విఘాతం కలిగించేలా ఈ జీవో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట వైద్యులు నినాదాలు చేశారు. ప్రభుత్వం జీవోను మార్చే వరకు తాము విధులకు హాజరుకాబోమని స్పష్టంచేశారు. ఇన్ సర్వీస్ కోటాలో వైద్యులు పీజీ చదువుకునేందుకు గతంలో నాన్ క్లినికల్ పీజీకి 50 శాతం, క్లినికల్ పీజీకి 30 శాతం పరిమితి ఉండేది. ప్రభుత్వం ఇటీవల కాలంలో ఈ కోటాలను 30, 10 శాతానికి కుదిస్తూ జీవో నెం.85 విడుదల చేసింది. ఈ జీవోను మార్పు చేయాలంటూ పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యులు ఈనెల 16 నుంచి విధులు బహిష్కరించి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 64 మంది పీహెచ్‌సీ వైద్యులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ఇండియన్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచి
Indian Bank
6/1/211/212, బ్యాంక్ స్ట్రీట్, అరండల్‌పేట, నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్-522601. ఫోన్: 08647-222064

పబ్లికేషన్ డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం నోటీసు
మీకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించిన తేది : 18.09.2024 న పంపబడినది.

టు, 1) మెస్సర్స్ యర్రంశెట్టి ఆటో సర్వీసెస్, యజమాని: యర్రంశెట్టి శ్రావణ రఘు వంశీ, డి.నెం. 13-1-79, ఓల్డ్ క్లబ్‌రోడ్, కొత్తపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001 (ఋణగ్రహీత). 2) శ్రీ యర్రంశెట్టి శ్రావణ రఘు వంశీ, తండ్రి: రాములు యర్రంశెట్టి, ఫ్లాట్ నెం. 401, యర్రంశెట్టి టవర్స్, రావిపాడు రోడ్డు, కాకతీయ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఎ.పి.-522601 (యజమాని). 3) మెస్సర్స్ యర్రంశెట్టి మోటార్స్, డి.నెం. 7-158, రావిపాడు రోడ్డు, కాకతీయ నగర్, యర్రంశెట్టి టవర్స్, నరసరావుపేట, పల్నాడు జిల్లా-522601 (హామీదారు కమ్ తనఖాదారు). 4) శ్రీ హనుమంతరావు యర్రంశెట్టి, తండ్రి: శేషగిరిరావు యర్రంశెట్టి, ఫ్లాట్ నెం. 101, యర్రంశెట్టి టవర్స్, రావిపాడు రోడ్డు, కాకతీయ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఎ.పి.-522601 (హామీదారు). 5) శ్రీ రాములు యర్రంశెట్టి, తండ్రి: శేషగిరిరావు యర్రంశెట్టి, ఫ్లాట్ నెం. 401, యర్రంశెట్టి టవర్స్, రావిపాడు రోడ్డు, కాకతీయ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఎ.పి.-522601 (హామీదారు).

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు - ఇండియన్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచి వారి యొద్దనున్న మీ ఖాతా నదుపాయము OCC-TRADEWELL, A/C NO.6228888277 గురించి.

పైన ఉన్న లోన్‌ఖాతాకు సంబంధించి ది.18.09.2024 నాటికి మీరు తిరిగి చెల్లించవలసిన బకాయిసొమ్ము రూ.3,06,71,330/- (అక్షరాల మూడు కోట్ల ఆరు లక్షల డెబ్బై ఒక్క వేల మూడు వందల ముప్పై రూపాయలు మాత్రమే) ఈ మొత్తాన్ని 19.09.2024 తేదీ నుండి తిరిగి చెల్లింతే తేదీ వరకు అంగీకరించిన వడ్డీరేటుకు మరింత వడ్డీ కలిగి ఉంటుంది.

ఇందుమూలంగా 18.09.2024 తేదీన జారీచేసిన నోటీసు ప్రకారం చెల్లించవలసిన బకాయిసొమ్ము ది.18.09.2024 నాటికి రూ.3,06,71,330/- (అక్షరాల మూడు కోట్ల ఆరు లక్షల డెబ్బై ఒక్క వేల మూడు వందల ముప్పై రూపాయలు మాత్రమే) చెల్లించవలెనని ఈ నోటీసు రిజిస్టర్ పోస్టు ద్వారా మీకు పంపినసూ మాకు తిరిగి వచ్చినది.

19.09.2024 తేదీ నుండి అంగీకరించబడిన వడ్డీ మరియు ఇతర ఖర్చులు నోటీసు తేది నుండి 60 రోజులలో చెల్లించుటలో విఫలమైన యెడల బ్యాంకు వారు ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ప్రకారం తమ అధికారములను ఉపయోగించి క్రింద ఇవ్వబడిన షెడ్యూలులోని వివరముల ప్రకారం స్వాధీనం చేసుకొను అధికారం కలిగియున్నారు. ఈ నోటీసు బ్యాంకు వారికి ప్రస్తుతము అమలులోనున్న ఇతర చట్టబద్ధమైన హక్కులకు భంగము వాటిల్లకుండా జారీచేయబడినది.

షెడ్యూలు: సెక్యూరిటీ ఇంటరెస్ట్ క్రింద తనఖా ఉంచబడిన సదరు ఆస్తుల వివరాలు ఈ క్రింద వివరించబడినవి: తనఖా ఉంచబడిన ఆస్తి:

ఆస్తుల యొక్క షెడ్యూలు (ఆస్తి వారీగా)

'ఎ' షెడ్యూలు (స్థలము): గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్-జిల్లా, నరసరావుపేట సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, నరసరావుపేట మండలం, రావిపాడు రోడ్డు, నరసరావుపేట రెవెన్యూ గ్రామము, డి.నెం.515/ఎ నందు యం॥ 2.41 సెంట్లలో యం॥ 0.45 సెంట్లలో 2222.5 చ॥గ॥ లేదా 1858.27 చ॥మీ॥ స్థలము ఈ దిగువ హద్దులలో: తూర్పు: వీరపల్లి వరదయ్యకు చెందిన ఆస్తి-190'6"; దక్షిణం: పల్నాడు హైవే రోడ్డు-105'; పడమర: శ్రీనివాస రెడ్డికి చెందిన ఫ్లాట్స్ఆస్తి-190'6"; ఉత్తరం: గోవాడ కమలేశ్వరరావు మరియు అడుసుమల్లి వెంకట శివప్రసాద్‌కు చెందిన ఆస్తులు-105'. ఈ పై హద్దుల మధ్యలోని 2222.5 చ॥గ॥ = 1858.27 చ॥మీ॥ స్థలములో అవిభాజ్యపు మరియు అవిర్ణిష్టపు భాగమైన 374.85 చ॥గ॥ లేదా 314.37 చ॥మీ॥ స్థలములు.

ఐటమ్ నెం.1: జి1- 77.625 చ॥గ॥ లేదా 65.90 చ॥మీ॥. 1625 చ॥అ॥ ప్లింత్‌ఏరియాతో యర్రంశెట్టి మోటార్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని వెస్ట్ కార్నర్.

ఐటమ్ నెం.2: జి2- 77.625 చ॥గ॥ లేదా 65.90 చ॥మీ॥. 1625 చ॥అ॥ ప్లింత్‌ఏరియాతో యర్రంశెట్టి మోటార్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఈస్ట్ కార్నర్.

ఐటమ్ నెం.3: జి3- 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥. 1150 చ॥అ॥ ప్లింత్‌ఏరియాతో యర్రంశెట్టి మోటార్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని వెస్ట్ సైడ్ మిడిల్.

ఐటమ్ నెం.4: జి4- 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥. 1150 చ॥అ॥ ప్లింత్‌ఏరియాతో యర్రంశెట్టి మోటార్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఈస్ట్ సైడ్ మిడిల్.

ఐటమ్ నెం.5: జి5- 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥. 1150 చ॥అ॥ ప్లింత్‌ఏరియాతో యర్రంశెట్టి మోటార్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని వెస్ట్ సైడ్ మిడిల్.

ఐటమ్ నెం.6: జి6- 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥. 1150 చ॥అ॥ ప్లింత్‌ఏరియాతో యర్రంశెట్టి మోటార్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఈస్ట్ సైడ్ మిడిల్ ఖాళీస్థలము అనగా. "బి" షెడ్యూలు ఆస్తి.

బి-షెడ్యూలు (ఫ్లాట్ వైజ్)

ఐటమ్ నెం.1: "యర్రంశెట్టి టవర్స్" స్టిల్ట్ ఫ్లోర్‌లో ప్రతిపాదిత నిర్మాణంలో కేటాయించబడిన 925 చ॥అ॥లతో పాటు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో సౌత్ వెస్ట్ కార్నర్‌లో 1625 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని), ప్లింత్ ఏరియాలోని 3 బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.జి1 మరియు 2222.5 చ॥గ॥ల స్థలములో అవిభాజ్యపు మరియు అవిర్ణిష్టపు భాగమైన 77.625 చ॥గ॥ లేదా 64.90 చ॥మీ॥ స్థలముతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా; దక్షిణం: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; పడమర: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; ఉత్తరం: గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి3 మధ్యలోని ఓపెన్ ఏరియా.

ఐటమ్ నెం.2: "యర్రంశెట్టి టవర్స్" స్టిల్ట్ ఫ్లోర్‌లో ప్రతిపాదిత నిర్మాణంలో కేటాయించబడిన 925 చ॥అ॥లతో పాటు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో సౌత్ ఈస్ట్ కార్నర్‌లో 1625 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని), ప్లింత్ ఏరియాలోని 3 బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.జి2 మరియు 2222.5 చ॥గ॥ల స్థలములో అవిభాజ్యపు మరియు అవిర్ణిష్టపు భాగమైన 77.625 చ॥గ॥ లేదా 64.90 చ॥మీ॥ స్థలముతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; దక్షిణం: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; పడమర: ఉమ్మడి వరండా; ఉత్తరం: గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి4 మధ్యలోని ఓపెన్ ఏరియా.

ఐటమ్ నెం.3: "యర్రంశెట్టి టవర్స్" స్టిల్ట్ ఫ్లోర్‌లో ప్రతిపాదిత నిర్మాణంలో కేటాయించబడిన 925 చ॥అ॥లతో పాటు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో వెస్ట్‌సైడ్ మిడిల్‌లో 1150 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని), ప్లింత్ ఏరియాలోని 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.జి3 మరియు 2222.5 చ॥గ॥ల స్థలములో అవిభాజ్యపు మరియు అవిర్ణిష్టపు భాగమైన 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥ స్థలముతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా; దక్షిణం: గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి1 మధ్యలోని ఓపెన్ ఏరియా; పడమర: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; ఉత్తరం: మెట్లు మరియు గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి5 మధ్యలోని ఓపెన్ ఏరియా.

ఐటమ్ నెం.4: "యర్రంశెట్టి టవర్స్" స్టిల్ట్ ఫ్లోర్‌లో ప్రతిపాదిత నిర్మాణంలో కేటాయించబడిన 925 చ॥అ॥లతో పాటు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఈస్ట్ సైడ్ మిడిల్‌లో 1150 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని), ప్లింత్ ఏరియాలోని 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.జి4 మరియు 2222.5 చ॥గ॥ల స్థలములో అవిభాజ్యపు మరియు అవిర్ణిష్టపు భాగమైన 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥ స్థలముతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; దక్షిణం: గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి2 మధ్యలోని ఓపెన్ ఏరియా; పడమర: ఉమ్మడి వరండా; ఉత్తరం: లిఫ్ట్ & గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి6 మధ్యలోని ఓపెన్ ఏరియా.

ఐటమ్ నెం.5: "యర్రంశెట్టి టవర్స్" స్టిల్ట్ ఫ్లోర్‌లో ప్రతిపాదిత నిర్మాణంలో కేటాయించబడిన 925 చ॥అ॥లతో పాటు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో వెస్ట్ సైడ్ మిడిల్‌లో 1150 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని), ప్లింత్ ఏరియాలోని 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.జి5 మరియు 2222.5 చ॥గ॥ల స్థలములో అవిభాజ్యపు మరియు అవిర్ణిష్టపు భాగమైన 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥ స్థలముతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా; దక్షిణం: మెట్లు మరియు గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి3 మధ్యలోని ఓపెన్ ఏరియా.; పడమర: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; ఉత్తరం: గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి7 మధ్యలోని ఓపెన్ ఏరియా.

ఐటమ్ నెం.6: "యర్రంశెట్టి టవర్స్" స్టిల్ట్ ఫ్లోర్‌లో ప్రతిపాదిత నిర్మాణంలో కేటాయించబడిన 925 చ॥అ॥లతో పాటు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఈస్ట్ సైడ్ మిడిల్‌లో 1150 చ॥అ॥ (కామన్ ఏరియా కలుపుకొని), ప్లింత్ ఏరియాలోని 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.జి6 మరియు 2222.5 చ॥గ॥ల స్థలములో అవిభాజ్యపు మరియు అవిర్ణిష్టపు భాగమైన 54.90 చ॥గ॥ లేదా 45.90 చ॥మీ॥ స్థలముతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: గ్రౌండ్‌లోని ఓపెన్ ఏరియా; దక్షిణం: లిఫ్ట్ మరియు గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి4 మధ్యలోని ఓపెన్ ఏరియా.; పడమర: ఉమ్మడి వరండా; ఉత్తరం: గ్రౌండ్‌లో ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.జి8 మధ్యలోని ఓపెన్ ఏరియా.

గమనిక: పైన పేర్కొన్న సెక్యూరిటీలు కూడా మెస్సర్స్ యర్రంశెట్టి మోటార్స్, అకౌంట్ నెం. 702807278 ఖాతాకు తనఖాగా ఉన్నాయి మరియు ఖాతాను క్రమబద్ధీకరించబడే వరకు శ్రీ యర్రంశెట్టి హనుమంతరావు యొక్క వ్యక్తిగత హామీదారు జ్యువెల్ లోన్ ఖాతాలు కూడా వేలం వేయబడతాయి.

తేది: 18.09.2024, ప్రదేశం: నరసరావుపేట సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్